జ్వాల తెలుగు న్యూస్
RNI NO: TELTEL/2023/88524
మెదక్ టుడే
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...
17 నవంబరు 2025 మెదక్ పేజీలు :5 వెల రూ.:2 ఎడిటర్: సిహెచ్. శివకుమార్ సంపుటి 02 సంచిక 69



## మావోల ఎన్‌కౌంటర్

**ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఎదురుకాల్పులు**
**సుక్మా అడవుల్లో భద్రతా దళాల మెరుపుదాడి**
**ముగ్గురు మావోయిస్టులు మృతి**

2

సుక్మా జిల్లాలోని బెజ్జి, చింతగుఫా మధ్య దట్టమైన తుమాల్‌పాడ్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, వారికి మావోయిస్టులు ఎదురు పడ్డారు. మావోయిస్టులు కాల్పు లు ప్రారంభించగా, జవాన్లు ధీటుగా ఎదురుకాల్పులు జరిపారు. ముగ్గురు మావోలు మృతిచెందారు.



# నో క్యాష్ వర్క్?

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ మెరుపుదాడులు
సోదాల్లో విస్తుపోయే నిజాలు భారీగా సొమ్ము, డాక్యుమెంట్లు స్వాధీనం
లావాదేవీలను బట్టి వసూళ్లు...వేలకు వేలు అదనం
దళారుల దందా, నిబంధనలకు పాతరే
సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లపై దాడులు... ఆస్తిపత్రాలు, నగదు స్వాధీనం

> అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2024 నుంచి రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలు తెచ్చినా, కొందరి తీరు మారకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.గండిపేట, మేడ్చల్, నిజామాబాద్, మిర్యాలగూడ సహా మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు.11 కార్యాలయాల్లో లెక్కల్లో చూపని రూ. 2.51 లక్షలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. 19 మంది అనధికార వ్యక్తులు, 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాల్లో తిష్ఠ వేసినట్లు గుర్తించారు. వసూళ్ల కోసం రిజిస్ట్రేషన్ పూర్తయిన 289 డాక్యుమెంట్లను కార్యాలయాల్లో దాచిపెట్టినట్లు బయటపడింది.

**హైదరాబాద్ నవంబర్ 16:** రాష్ట్రంలోని అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థలం, అపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం దారుణంగా ఉంది. 'చేతులు తడిపితేనే' పని జరిగే పరిస్థితి నెలకొంది. వసూళ్ల దందా అంతా అనధికార వ్యక్తులు, ముఖ్యంగా దళారులు, డాక్యుమెంట్ రైటర్ల ఆధ్వర్యంలో జరుగుతోంది. నిబంధనల ప్రకారం కార్యాలయాల్లోకి వీరికి అనుమతి లేకపోయినా, వీరే వ్యవహారాలు చక్కబెట్టేస్తున్నారు. కొన్ని కార్యాలయాల పరిధిలో దళారుల ప్రమేయంతో అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఉదాహరణకు, నాలా పన్ను చెల్లించకున్నా, లింక్ డాక్యుమెంట్లు లేని ఆస్తులకూ రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు.

**ఒక్కో లావాదేవీకి వేలకు వేలు డిమాండ్** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల తీరు దారుణంగా ఉంది. ప్రాంతాలను బట్టి వసూళ్లు మారుతున్నాయి:

**గజానికి వసూలు:** హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గజానికి రూ. 200 నుంచి రూ. 500, జిల్లాల్లో అయితే రూ. 100 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.

**నీటి వనరుల పక్కన:** నీటి వనరులకు చెంత

మిగతా 2లో

## 'రిజర్వేషన్లలో క్రిమీలేయర్ కావాలి!'

**ఐఏఎస్ పిల్లలను, పేద కూలీలను సమానంగా చూడలేం**
**'ఓబీసీలకు ఒక న్యాయం, ఎస్సీలకు మరొకటా?'**
**సీజేఐ జస్టిస్ గవాయ్ సంచలన ప్రకటన**
**ఎస్సీ రిజర్వేషన్ల లబ్ధిపై ప్రశ్న**



**అమరావతి :** భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ షెడ్యూల్డు కులాలకు (ఎస్సీ) సంబంధించిన రిజర్వేషన్ల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీలకు ఇస్తున్న రిజర్వేషన్లలో కూడా క్రిమీలేయర్ విధానం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజంగా అణగారిన వర్గాలకు చేరుతున్నాయా అనే సందేహాన్ని ఆయన ఈ సందర్భంగా లేవనెత్తారు."రిజర్వేషన్ల విషయంలో ఒక ఐఏఎస్ అధికారి పిల్లలను, ఒక పేద రైతు కూలీ సంతానాన్ని ఒకే విధంగా పరిగణించకూడదు" అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో తాను ఇంద్ర సాహ్నీ కేసు తీర్పులో కనిపించిన క్రిమీలేయర్ భావనను స్వీకరించానని తెలిపారు. ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ)లకు వర్తించే క్రిమీలేయర్ విధానాన్ని ఎస్సీలకు కూడా ఎందుకు వర్తింపజేయకూడదు? అని ఆయన ప్రశ్నించారు. గతంలో తన తీర్పుపై విమర్శలు వచ్చినా, ఈ అభిప్రాయంపై

మిగతా 2లో

## గందరగోళం

**టెట్ దరఖాస్తుల్లో సాంకేతిక తిరకాసు**
**పాత హాల్‌టికెట్ నంబర్లు, బీఈడీ వివరాల నమోదులో సమస్యలు**
**2024, 2025 వివరాలు తిరస్కరణ**



2

## వణికిస్తున్న శీతల గాలులు

**ఉష్ణోగ్రతల పతనం 11 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్**
**సింగిల్ డిజిట్‌కు చేరిన ఉష్ణోగ్రతలు...**
**గడ్డకడుతున్న సిర్పూర్**
**ఏపీకి భారీ వర్షాల ముప్పు**



11జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం వేళల్లో పొగమంచు కురుస్తుండగా, రాత్రి సమయాల్లో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో 11 జిల్లాల్లో ఇప్పటికే సింగిల్ డిజిట్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా, మిగిలిన జిల్లాల్లోనూ 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

మిగతా 2లో

# సీఎం రేవంత్ బ్రాండ్

**జూబ్లీహిల్స్ విజయంతో కాంగ్రెస్‌లో తిరుగులేని శక్తిగా సీఎం**
**నాయకత్వంపై నమ్మకం.. 'ఒంటి చేత్తో' ఉప ఎన్నికల విజయం**
**అంతర్గత ప్రజాస్వామ్యానికి తాళం... విమర్శలకు చెక్**



**హైదరాబాద్ నవంబర్ 16:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో మరింతగా రుజువైంది. గత రెండేళ్లలో జరిగిన రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి 'ఒంటి చేత్తో' గెలిపించారు. బీహార్ ఎన్నికల తర్వాత సీఎం మార్పు ఉంటుందన్న ప్రచారాల నుంచి, ఆరు గ్యారంటీలు పనిచేయలేదన్న విమర్శల వరకు... ప్రత్యర్థులు చేసిన ప్రచారాలన్నిటినీ ప్రజలు తిప్పికొట్టారనడానికి ఈ మాటల దాడి ప్రజలను ఫలితమే నిదర్శనం.

**ఫైర్ ఫార్ములా: రేవంత్‌ను సీఎంను చేసిన వ్యూహం**

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు అధికారాన్ని కోల్పోయింది. అప్పుడే, టీడీపీ నుంచి వచ్చినప్పటికీ, రేవంత్ రెడ్డిలోని 'ఫైర్' మరియు దూకుడును గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ చీఫ్ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి గత పదేళ్ల పాలకుడు కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన

మిగతా 2లో

## నమ్మకద్రోహం

**హైదరాబాద్‌లో సినీ ఫక్కీలో దోపిడీ**
**కారానాల్లో నేపాలీ ముఠా భారీ దొంగతనం,**
**ఇంట్లో పని చేసే వారే దొంగలు**
**ప్లాస్టర్‌తో కట్టేసి కర్రలతో దాడి,**
**రూ. 50 లక్షల దోపిడీ... కేసు నమోదు**

2



## ఫిరాయింపులపై న్యాయబద్ధంగా వ్యవహరించాలి'

**బెంగాల్ పరిస్థితి రాకూడదు**
**స్పీకర్ చట్టబద్ధమైన నిర్ణయం తీసుకోవాలి**
**రాజ్యాంగ బద్ధతపై మాకు పూర్తి నమ్మకం**
**మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి**

2



మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
సోమవారం 17-11-2025

## సీఎం రేవంత్ బ్రాండ్

ఆకట్టుకోవడంతో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ ఫైర్‌ను గుర్తించే ఢిల్లీ నాయకత్వం సీనియర్లను పక్కనపెట్టి రేవంత్‌కే ముఖ్యమంత్రి పీఠం అప్పగించింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ దూరం పెడుతున్నారన్న ప్రచారానికి జూబ్లీహిల్స్ విజయం తెరదించింది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిని కూడా లెక్కచేయని ఎమ్మెల్యేల నోళ్లు ఈ ఎన్నికల ఫలితంతో మూతపడతాయి. ముఖ్యమంత్రి పదవిని తాను కొట్లాడి తెచ్చుకున్నది కాదని, కష్టపడి తెచ్చుకున్నది అని రేవంత్ రెడ్డి ఈ విజయం ద్వారా నిరూపించుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి అపూర్వమైన ప్రచారం నిర్వహించారు. ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయని విధంగా కార్నర్ మీటింగ్‌లు, రోడ్ షోలు నిర్వహించి, ప్రజలను మెప్పించి, ఒప్పించి సీటును దక్కించుకోగలిగారు. ఈ విజయం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని విధంగా సుస్థిరం చేసిందని, ఆయన ప్రత్యర్థులకు గట్టి జవాబు చెప్పిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## గందరగోళం



హైదరాబాద్, నవంబర్ 16 ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం నుంచి ప్రారంభమైనప్పటికీ, సాంకేతిక సమస్యలు అభ్యర్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా, పాత హాల్‌టికెట్ నంబర్ల స్వీకరణలో సమస్యలు తలెత్తుతున్నాయి.

**తిరస్కరణ:** వెబ్‌సైట్ కేవలం 2023 వరకు గల హాల్‌టికెట్ నంబర్లను మాత్రమే స్వీకరిస్తోంది. 2024, 2025లో జరిగిన టెట్ పరీక్ష వివరాలను నమోదు చేస్తే, 'తప్పుడు హాల్‌టికెట్ నంబర్' అంటూ సమాధానం వస్తున్నట్టు అభ్యర్థులు వాపోతున్నారు.

**అర్హత నమోదు, ఫీజు చెల్లింపులోనూ లోపాలు**

పాత హాల్‌టికెట్ నంబర్లతో పాటు, ఇతర కీలక వివరాల నమోదులోనూ సాంకేతిక లోపాలు అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి:

**బీఈడీ అర్హత:** బీఈడీ అర్హతతో ఎస్జీటీ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు వివరాలు నమోదు చేసే సమయంలో, బీఈడీ అర్హతతో అప్లికేషన్ స్వీకరించడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు.

ఫీజు చెల్లింపు: కొందరు అభ్యర్థులు ఫీజు చెల్లించిన జర్నల్ నంబర్‌ను నమోదు చేస్తే, 'పేమెంట్ ఐడీ రాంగ్' అని వస్తున్నట్టు గుర్తించారు.ఎడిట్ ఆప్షన్ లేక అభ్యర్థుల టెన్షన్: సవరణకు అవకాశం కల్పించాలని డిమాండ్సాంకేతిక లోపాల కారణంగా దరఖాస్తుల్లో పొరపాట్లు చేసిన అభ్యర్థులు, తప్పుగా వివరాలు నమోదు చేసినవారు తీవ్ర టెన్షన్‌కు గురవుతున్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సవరించుకునే (ఎడిట్ ఆప్షన్) అవకాశం ప్రస్తుతానికి కల్పించకపోవడం వారి ఆందోళనకు ప్రధాన కారణం. అభ్యర్థులు తక్షణమే దరఖాస్తులను సవరించుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు సమస్యలను పరిశీలించి, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## మెదక్ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత

**మెదక్ నవంబర్ 16 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

కోదండ రామాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన జనం బాట జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితఅనంతరం స్వామీ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు బ్యాషం



మధుసూదనాచారి ని పరామర్శించారుఇటీవల కాళ్ళ చికిత్స చేసుకున్న విషయం తెలుసుకున్న కవిత అనంతరం రెండు రోజుల పాటు జనం బాట పోగ్రామ్స్ సక్సెస్ చేసినా కార్యకర్తలు కు సన్మానం చేసినా జాగృతి అధ్యక్షురాలు కవిత ఈ కార్యక్రమంలో జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు

## నో క్యాష్...నో వర్క్

ఉన్న ప్రాంతాలైతే మరింత ఎక్కువ దండుకుంటున్నారు.

**బహుళ అంతస్తులు:** మూడు అంతకన్నా ఎక్కువ అంతస్తుల భవనాల రిజిస్ట్రేషన్‌కు ప్రాంతాన్ని బట్టి అంతస్తుకు రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో కొన్ని చోట్ల రూ. 20 వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

**ఆకస్మిక సోదాల్లో భారీగా అవకతవకలు:** రూ. 2.51 లక్షల అక్రమ నగదు స్వాధీనం అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2024 నుంచి రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలు తెచ్చినా, కొందరి తీరు మారకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

**సోదాలు:** గండిపేట, మేడ్చల్, నిజామాబాద్, మిర్యాలగూడ సహా మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు.

**పట్టుబడిన సొమ్ము:** 11 కార్యాలయాల్లో లెక్కల్లో చూపని రూ. 2.51 లక్షలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది.

**దళారులు:** 19 మంది అనధికార వ్యక్తులు, 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయాల్లో తిష్ఠ వేసినట్లు గుర్తించారు.

దాచిన డాక్యుమెంట్లు: వసూళ్ల కోసం రిజిస్ట్రేషన్ పూర్తయిన 289 డాక్యుమెంట్లను కార్యాలయాల్లో దాచిపెట్టినట్లు బయటపడింది.

**సీసీ కెమెరాలు:** చాలా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదని తేలింది.

**13 మంది సబ్ రిజిస్ట్రార్ల ఇళ్లపై దాడులు:** ఆస్తిపత్రాలు, నగదు స్వాధీనం కార్యాలయాల్లో దొరికిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని, ఏసీబీ అధికారులు 13 మంది సబ్ రిజిస్ట్రార్లకు చెందిన ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు. వారి ఇళ్ల నుంచి పెద్దఎత్తున నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువను లెక్కించే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నారు. మొత్తం 23 ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## 'రిజర్వేషన్లలో క్రిమీలేయర్ కావాలి!'

జస్టిస్ గవాయ్ 2024లో చేసిన ఒక వ్యాఖ్యను గుర్తు చేస్తూ, ఎస్సీలు, ఎస్టీలలో క్రిమీలేయర్‌ను గుర్తించి, వారికి రిజర్వేషన్ల ప్రయోజనాలను నిరాకరించడానికి రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలను ప్రస్తావించారు. "రాజ్యాంగం స్థిరమైనది కాదు. అది నిరంతరం పరిణామం చెందాలి, సహజసిద్ధంగా, అత్యాధునిక సజీవ పత్రంగా ఉండాలి" అని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**కాలానికి అనుగుణంగా మార్పు: అధికరణ 368** రాజ్యాంగం కాలక్రమేణా మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా మారాల్సిన ఆవశ్యకత ఉందని జస్టిస్ గవాయ్ నొక్కి చెప్పారు. రాజ్యాంగాన్ని సవరించే అవకాశాన్ని కల్పిస్తున్న అధికరణ 368 గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ అమలు చేయాల్సిన ఆవశ్యకతపై సుప్రీంకోర్టు ఆలోచనలను ఈ వ్యాఖ్యలు మరింత బలపరుస్తున్నాయి.

## ముగ్గురు మావోలు మృతి

**కొత్తగూడెం:** ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో భద్రతా దళాలు నిర్వహించిన కూంబింగ్ ఆపరేషన్ విజయవంతమైంది. సుక్మా జిల్లాలోని బెజ్జి, చింతగుఫా మధ్య గల తుమాల్‌పాడ్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల కోసం డీఆర్‌జీ భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, వారికి మావోయిస్టులు తారసపడ్డారు. వెంటనే మావోయిస్టులు కాల్పులు జరపగా, అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు.

**స్నైపర్ స్పెషలిస్ట్ హతం: మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు**

ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మృతి చెందిన వారిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. హతులైన వారిలో ముఖ్యమైన మావోయిస్టు నాయకుడు, జన్‌మిలీషియా కమాండర్ మరియు స్నైపర్ స్పెషలిస్ట్ అయిన మడివి దేవా కూడా ఉన్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ ఘటన మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బగా పరిగణించవచ్చు.

**భారీగా ఆయుధ సామగ్రి స్వాధీనం**

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి భద్రతా దళాలు ఒక 303 రైఫిల్, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లతో పాటు ఇతర ఆయుధాలు, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్లు దండకారణ్యంలో కొనసాగుతాయని భద్రతా దళాలు వెల్లడించాయి

## నమ్మక ద్రోహం...

**హైదరాబాద్** హైదరాబాద్‌లోని కారానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ దొంగతనం నగరం నడిబొడ్డున భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గన్‌రాక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న కెప్టెన్ గిరి (75) ఇంట్లో ఈ దొంగతనం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ దంపతులు రాజు, పూజ, మరో నలుగురితో కలిసి పక్కా ప్రణాళిక ప్రకారం ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. యజమాని నమ్మకాన్ని పెట్టుకున్న వారే, ఆయన ఒంటరిగా ఉన్న సమయాన్ని ఎంచుకుని విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు.

**మిస్టరీ థ్రిల్లర్‌ను తలపించిన దోపిడీ**

దొంగతనం తీరు అత్యంత క్రూరంగా, వ్యవస్థీకృతంగా ఉంది.

**దాడి:** ముఠా మొదట ఇంటి యజమాని గిరిపై కర్రలతో దాడి చేసి గాయపరిచింది.

**నియంత్రణ:** అనంతరం ఆయన కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి, నోటికి ప్లాస్టర్ వేశారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ దాడిలో గిరి ముఖానికి, కాళ్లకు గాయాలయ్యాయి.

**మత్తు మందు యత్నం:** ఇంట్లో పనిచేస్తున్న మరో మహిళకు మత్తు మందు ఇవ్వగా, గిరిని కూడా మత్తు మందుతో అదుపు చేసేందుకు ప్రయత్నించగా, ఆయన దానిని అడ్డుకున్నారని కారానా ఏసీపీ రమేశ్ తెలిపారు.

చోరీ విలువ: దొంగలు 25 తులాలకు పైగా బంగారం (గిరి ఒంటిపై ఉన్న నగలతో సహా), రూ. 23 లక్షల నగదును దోచుకున్నారు. మొత్తం దోపిడీ విలువ రూ. 50 లక్షలుగా అంచనా.

**6 బృందాలతో గాలింపు: సీసీటీవీలే కీలకం**

ఈ భారీ దొంగతనంపై కారానా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీకి పాల్పడిన నేపాలీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు 6 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

**అధికారుల వివరణ:** "చోరీ జరిగినప్పుడు యజమాని ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఇంట్లో పనిచేసే నేపాలీ దంపతులు రాజు, పూజలతో పాటు మరో నలుగురు ఇందులో ఉన్నారు. ప్రస్తుతం మత్తు మందు ఇచ్చిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటాం" అని ఏసీపీ రమేశ్ తెలిపారు.

**దర్యాప్తు పద్ధతి:** క్రైమ్ టీమ్‌లు ప్రధానంగా సీసీ కెమెరాల ఆధారంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ తరహా చోరీల నేపథ్యంలో, నగరంలో పనిచేసే వలస కార్మికుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వణికిస్తున్న శీతల గాలులు

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అసాధారణంగా పడిపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రాత్రి సమయాల్లో చలి గాలులు, ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు సాధారణ జీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి.

**తీవ్రత:** 11 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇప్పటికే సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. మిగిలిన ప్రాంతాల్లో కూడా 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**అత్యల్పం:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) లో అత్యల్పంగా 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

**హెచ్చరిక:** వాతావరణ శాఖ రాబోయే రెండ్రోజుల్లో సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉన్నందున, 11 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**రోడ్లపై ప్రమాద హెచ్చరిక:** వృద్ధులు, పిల్లలు జాగ్రత్త

దట్టమైన పొగమంచు, అతి తక్కువ ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు కీలక సూచనలు చేసిందిరహదారులపై దట్టమైన పొగమంచు సాయంత్రం నుంచి ఉదయం 8 గంటల వరకు కమ్ముకునే అవకాశం ఉంది.వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి.

చిన్నపిల్లలు, వృద్ధులు ఉదయం పూట ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**అల్పపీడనం ఆపద: ఏపీపై వర్షాల దాడి**

తెలంగాణలో శీతల గాలులు వీస్తుంటే, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ వైపు రెండు అల్పపీడనాలు దూసుకొస్తున్నాయి.

**మొదటి ముప్పు:** నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది.

**రెండవ ముప్పు:** ఈ నెల 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

**వర్షాల అంచనా:** ఈ వాతావరణ మార్పుల కారణంగా నెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.ప్రజలు చలి, రాబోయే వర్షాల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఫిరాయింపులపై న్యాయబద్ధంగా వ్యవహరించాలి

**జగిత్యాల:** మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టీ. జీవన్ రెడ్డి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత అంశంపై తెలంగాణ స్పీకర్‌కు పరోక్షంగా ఒత్తిడి పెంచారు. జగిత్యాలలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్పీకర్ చట్టబద్ధమైన నిర్ణయం తీసుకుంటారని తాను బలంగా నమ్ముతున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపర్చబడిన పార్టీ ఫిరాయింపు అంశంపై స్పీకర్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.స్పీకర్ నిర్ణయం ఆలస్యం అయితే లేదా న్యాయబద్ధంగా లేకుంటే జరిగే పరిణామాలను జీవన్ రెడ్డి పరోక్షంగా గుర్తు చేశారు. బెంగాల్ రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే విషయంలో హైకోర్టు జోక్యం చేసుకున్న తీర్పును ఆయన ప్రస్తావించారు."బెంగాల్ రాష్ట్రంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం సహేతుకంగా లేదన్న ఫిర్యాదు కారణంగానే న్యాయస్థానం స్పందించింది. తెలంగాణలో అలాంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుందని అనుకోవడం లేదు."అనవసర న్యాయ వివాదాలకు తావివ్వకుండా, స్పీకర్ తన పరిధిలోని ఈ అంశంపై త్వరగా సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.జీవన్ రెడ్డి వ్యాఖ్యల ద్వారా, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశాన్ని తేలికగా వదలడానికి సిద్ధంగా లేదని అర్థమవుతోంది. ఫిరాయింపు అంశం కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదని, రాజ్యాంగ నిబంధనలకు సంబంధించిన అంశమని, స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, స్పీకర్ తీసుకునే తదుపరి నిర్ణయం కీలకంగా మారనుంది.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి..

**పాపన్నపేట,నవంబర్,16,మెదక్ టుడే న్యూస్:**పాపన్నపేట మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు అట్కురి గోపాల్ రావు కుమారుడు రాజాశేఖర్ వివాహం కీర్తనతో ఇటీవల జరిగింది, మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి లు ఆదివారం ఆరేపల్లిలో నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్, బాల గౌడ్ తాజా మాజీ సర్పంచ్ లు శ్రీనాథ్ రావు, మల్లేశం, మాజీ ఏడుపాయల డైరెక్టర్ కాశమల.శ్రీనివాసరావు,మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్,మాజీ కౌన్సిలర్లు మామిళ్ళ ఆంజనేయులు ఆర్కే. శ్రీనివాస్ గడ్డమీద కృష్ణ గౌడ్, ఆరెపల్లి బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, నాయకులు అట్కురి బాలాజీ రావు పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్ క్యాంప్ సమాజ సేవకు ఎంతో ఉపయోగం

## అదనపుఎస్పీ మహేందర్

**పాపన్నపేట,నవంబర్,16,మెదక్ టుడే న్యూస్:**
ఎన్ఎస్ఎస్ క్యాంప్ సమాజసేవకు ఎంతగానో ఉపయోగపడుతుందని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. పాపన్నపేట మండల పరిధిలోని మల్లంపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎన్ఎస్ఎస్ క్యాడేట్ గా 13 శిబిరాల్లో పాల్గొని ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నానని వెల్లడించారు, ఈ క్యాంప్ ఎన్ఎస్ఎస్ క్యాడెట్లకు ఎన్నో విషయాలను నేర్పుతుందన్నారు, ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా క్యాడెట్లు సమాజానికి సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, ఇందులో భాగంగా మొదటి రోజు ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగుతుందని ఎన్ఎస్ఎస్ చైర్మన్ నర్సింలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జూలకంటి శ్రీనివాస్ , కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ ఎస్ .సంతోష్ కుమార్ జువాలజీ లెక్చరర్ బి.ప్రవీణ్ , అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.




# ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు..

**పాపన్నపేట,నవంబర్,16,మెదక్ టుడే న్యూస్:**పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్ పల్లి వేణు గోపాల స్వామీ దేవాలయం ప్రాంతంలో ఆదివారం రోజు పాపన్నపేట మండల ఆర్యవైశ్య సంఘం,మహిళా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా కొత్త వెంకటేశం గుప్తా, ప్రధాన కార్యదర్శిగా బెజగం విఠలేశ్వర్ గుప్తా, కోశాధికారిగా గడ్డం రాజు గుప్తా, మహిళ మండల సంఘం అధ్యక్షురాలు కొత్త సరస్వతి,ప్రధాన కార్యదర్శిగా సిద్ధంశెట్టి స్వప్న,కోశాధికారిగా కొత్త శివ జ్యోతిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక వనభోజనాలు స్వీకరించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.





# మెదక్ జిల్లాలో టిఆర్పిని బలోపేతం చేస్తున్నాం

## వివిధ పార్టీల నుంచి టీఆర్పీలో చేరికలు
## కండువా కప్పి ఆహ్వానించిన టిఆర్పి చీఫ్ తీన్మార్ మల్లన్న
## టిఆర్పి రాష్ట్ర కార్యదర్శి బస్వాపురం నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చేరికలు
## పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జ్ పండేల్ జ్యోతి
## సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అనిల్
## గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ యాదగిరి గౌడ్

**మెదక్ జిల్లా నర్సాపూర్ నవంబర్ 16 మెదక్ టుడే న్యూస్**
తెలంగాణ రాజ్యాధికార పార్టీలో వివిధ పార్టీలకు చెందిన అనేక మంది కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి బస్వాపురం నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు వాళ్లకు సాధారణంగా ఆహ్వానం పలుకుతూ టిఆర్పి చీఫ్ తీన్మార్ మల్లన్న కండువాలు కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా లిరాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూలితెలంగాణ రాజ్యాధికార పార్టీని 2028లో తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాధికారంలోకి తీసుకురావడానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నాము మెదక్ జిల్లా నుంచి నర్సాపూర్ నియోజకవర్గం నుండి అనేకమంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఈరోజు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో జాయిన్ అయ్యారు. వాళ్లందరికీ స్వాగతం పలుకుతున్నాం ఇక బీసీల రాజ్యం రాబోతుంది రెడ్ల రాజ్యం ఇప్పుడు నడుస్తుంది వెలమల రాజ్యం అయిపోయింది నెక్స్ట్ వచ్చే రాజ్యం 100% బీసీల రాజ్యమే అని ముక్తకంఠంతో తెలియజేస్తున్నాం మెదక్ జిల్లాను అన్ని జిల్లాలతో పోటీపడి ముందు వరుసలో నిలబెడుతున్నాం. ఎవరిని కుట్రలు చేసినా 2028లో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా తీన్మార్ మల్లన్న ఉండబోతున్నాడు టిఆర్పి పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాబోతుంది అని తెలుసుకున్న అగ్రవర్ణ నాయకులు కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారు మీ కుట్రలకు ఎట్టి పరిస్థితిలోనూ భయపడేది లేదు మీ కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఎండగడుతూ ఉంటాము. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా టిఆర్పి ఇన్చార్జ్ ఫండేల్ జ్యోతి, సంగారెడ్డి జిల్లా టిఆర్పి అధ్యక్షులు అనిల్ కుమార్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమాంపురం యాదగిరి గౌడ్ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ చెంద్రశేఖర్ నర్సాపూర్ నియోజకవర్గ రాములు ముదిరాజ్ కుమ్మరి భూషణం రాజు నాయక్ ప్రదీప్ నవీన్ సురేష్ కాదుల్లూరి కుమార్ వెల్దుర్తి దాసు చంద్రకాంత్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



# ఢిల్లీకి బయలుదేరిన చేగుంట ఎమ్మార్పీఎస్ నాయకులు



**చేగుంట నవంబర్ 16 మెదక్ టుడే న్యూస్**
చేగుంట ఎమ్మార్పీఎస్ నాయకులు సుప్రీంకోర్టు జడ్జి సిజేఐ మీద దాడి జరిగి 39 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు ఇది దేనికి నిదర్శనం దళితుల పట్ల ఎంతటి సామాజిక గౌరవం ప్రేమ ఉందో అర్థమవుతుంది. సిజెఐ గవాయి కి న్యాయం జరగాలని నిరసనగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దళిత ఆత్మ గౌరవ ప్రదర్శనలో పాల్గొనడానికి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి కేసు ఫైల్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఢిల్లీ వెళ్లి వెళ్లిన వారిలో రామచంద్రం మాదిగ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెదక్ జిల్లా అధ్యక్షులు కొప్పుల రామస్వామి మాదిగ తొంట దుర్గపతి మాదిగ, పుక్తిగల జనార్ధన్ మాదిగ తదితరులు ఉన్నారు

# రాఘవేంద్ర కాలనీలో శ్రీ నల్లపోచమ్మ దేవాలయం ఆవరణలో అన్నదాన సత్రం కొరకు షెడ్డును శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.



**అమీన్పూర్ నవంబర్ 16 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ పరిధిలో శ్రీ నల్లపోచమ్మ దేవాలయం ఆవరణలో అన్నదాన సత్రం కోసం షెడ్డును శంకుస్థాపన చేసిన స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటాన్చెరు నియోజకవర్గంలో ఆలయ నిర్మాణం



కొరకు ఎల్లవేళలా నా పూర్తి సహకారం ఉంటుంది అమ్మవారి ఆశీస్సులు ప్రజల అందరి మీద ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ , జి జనార్దన్ రెడ్డి , ఎం మల్లేష్, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు,రాఘవేంద్ర కాలనీ సొసైట మెంబర్స్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు..

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 457 మందిపై కేసులు

హైదరాబాద్ సిటీ పోలీసులు రెండు రోజులుగా నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 457మంది మద్యం తాగినట్లు గుర్తించారు. 14,15 తేదీల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో 377 మంది టూవీలర్, 27మంది త్రీవీలర్, 53 మంది ఫోర్‌వీలర్ వాహనదారులు ఉన్నారని వారు పేర్కొన్నారు. అందరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# పోలీస్ జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్: జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు,

**మెదక్ నవంబర్ 16 మదర్ టుడే న్యూస్ ప్రతినిధి**

ఆదివారంరోజు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఆధ్వర్యంలో జిల్లా పోలీసు సిబ్బంది మరియు జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు జట్లూ ఉత్సాహంతో పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాయి.మ్యాచ్ ప్రారంభానికి ముందుగా రెండు జట్లు గ్రౌండ్‌కు చేరుకున్నాయి. మొదట టాస్ గెలిచిన జర్నలిస్టుల జట్టు కెప్టెన్ నరేష్ గారు బ్యాటింగ్ ఎంచుకున్నారు. ప్రతిభావంతమైన షాట్లతో జర్నలిస్టుల జట్టు 15.5 ఓవర్లలో 101 పరుగులు 10 వికెట్లు కోల్పోయారు.తదుపరి ఇన్నింగ్స్‌లో 102 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా పోలీస్ జట్టు క్రమబద్ధంగా రన్స్ సాధిస్తూ ముందుకు సాగింది. 2 వికెట్లు మాత్రమే కోల్పోయి, 11.4 ఓవర్లలో లక్ష్యాన్ని చెదించగలిగింది. చివరి పరుగును స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ గారు చేసి జట్టుకు విజయాన్ని అందించారు.మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన నరేష్ ఆర్ఎస్ఐ గారికి “మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్” బహుమతిని, రన్నరప్‌గా నిలిచిన జర్నలిస్టుల జట్టుకు, విన్నర్‌గా నిలిచిన పోలీస్ జట్టుకు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఐపీఎస్ మరియు మెదక్ ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు .జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, జట్టు భావన అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పోలీస్-మీడియా సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇలాంటి స్నేహపూర్వక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో మెదక్ పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్నా క్రికెట్ గ్రౌండ్ ను అతి త్వరలో ఒక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ తో ప్రారంభింప చేస్తామన్నారు. జిల్లా యువత కు ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంపు లు నిర్వహించే విధంగా కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని స్నేహపూర్వహక మ్యాచ్ లు నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు.ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ మెదక్ డియస్పి ప్రసన్న కుమార్ తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్ ఏఆర్ డియస్పి రంగా నాయక్ , సీఐ లు వెంకట రాజా గౌడ్ రాజా శేఖర్ రెడ్డి , జర్జ్ ఆర్ఐ శైలందర్ రామకృష్ణ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేష్ గౌడ్ జర్నలిస్ట్ మిత్రులు, పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# బుద్ధ విహార్ ప్రాంగణంలో తొలిసారిగా జాడే పరివార్ పెళ్లి

## బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలి

## -భైంసా బుద్ధావిహార్ కమిటీ సభ్యులు.

**లోకేశ్వరం,నవంబర్,16,మెదక్ టుడే న్యూస్:**

భైంసా: పట్టణంలోని బుద్ధ విహార్ (టెక్డి) ప్రాంగణంలో మెట్ట మొదటిసారిగా నిగ్వ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుడు, ప్రశ్నించే గొంతు జాడే లక్ష్మణ్ తో,దేగాం గ్రామానికి చెందిన పుగ్లె విద్యషిలకు ఈ నెల 13న వివాహం జరిగింది.ఈ బుద్ధ విహార్ లో మొట్ట మొదటి పెళ్ళికాగ,ఈ సందర్భంగా బుద్ధ విహార్ నిర్మాణం కొరకు రూ.10 వేలు విరాళంగా విహార్ టీం సభ్యులకు ఆదివారం అందచేశారు.దీంతో విహార్ టీం సభ్యులు నూతన వధూవరులకు బుద్ధుడు,అంబేద్కర్, చిత్రపటాలు అందచేసి జై భీమ్ లు తెలియజేశారు. అలాగే ఈ అవకాశం కల్పించిన బుద్ధ విహార్ కమిటి సభ్యులకు జాడే లక్ష్మణ్ కుటుంబ సభ్యులు, మరియు పుగ్లె పరివార్ కుటుంబ సభ్యులు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ, నూతన వధూవరుల దంపతుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వడియారం పెద్ద చెరువులో మొసల్లు కల కలం

## చాలా రోజులు అవుతుంది అంటున్న గ్రామస్తులు

**చేగుంట నవంబర్ 16 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం వడియారం గ్రామంలో పెద్ద చెరువులో మొసల్లు కలకలం రేపిన సంఘటన. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడియారం చెరువులో ఆదివారం మధ్యాహ్నం రెండు మొసల్లు తిరుగుతూ స్థానికుల కంట పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో చెరువులోకి వరద నీరు చేరడంతో మొసళ్ళు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. రోజు చెరువు మీదుగా వ్యవసాయ పనిలోకి వెళ్లే రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకొని తీసుకెళ్లాలని కోరుతున్నారు.





# జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా టీఎస్ జేయు జిల్లా అధ్యక్షుడు డా. పేట భాస్కర్ రక్తదానం

**జగిత్యాల జిల్లా ప్రతినిధి,** :జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగోని పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆదేశాలతో టిఎస్జేయూ జగిత్యాల జిల్లా అధ్యక్షులు డా. పేట భాస్కర్, ప్రధాన కార్యదర్శి జోరిగే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి ఆకుల హనుమాండ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమాండ్లు మాట్లాడుతూ.... తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న జర్నలిస్టుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించి పాత్రికేయుల సమస్యలపై పోరాడడం జరిగిందని అన్నారు. తమ పార్టీ పక్షాన రానున్న కాలంలో జర్నలిస్టులకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి అనేక రాయితీలు కల్పించడం జరుగుతుందని , ప్రభుత్వ ఆదరణ లేక జర్నలిస్టుల పరిస్థితి దయనీయంగా మారిందని వ్యవస్థ పై పూర్తి పరిజ్ఞానం ఉన్న తీన్మార్ మల్లన్న జర్నలిస్టులకు న్యాయం చేయగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దీకొండ మురళి, మల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మెన శ్రీహరి, జెంజరి గంగాధర్, గట్ల శ్రీనివాస్ వివిధ సంఘాల నాయకులు ఎలిశెట్టి గంగారెడ్డి, నల్ల శ్యాం, ఎస్ రాజయ్య, గజ్జెల రాజు, సుంకర పల్లి అశోక్, బ్లడ్ బ్యాంకు మెడికల్ అధికారి డాక్టర్ గీతిక, టెక్నికల్ స్టాఫ్ సి హెచ్ రాజేందర్, వేణుగోపాల్, నర్సింగ్ అధికారులు ఈ.దివ్య,నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## కుంట శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి




**మోర్తాడ్** :పాలెం కి చెందిన బీజేపీ మోర్తాడ్ మండల ఉపాధ్యక్షులు కుంట శ్రీనివాస్ రెడ్డి నాయనమ్మ ఇటీవల స్వర్గస్థులయ్యారు, జాతీయ పసుపు బోర్డ్ చైర్మన్ పల్లె గంగారెడ్డి ఆదివారం కుంట శ్రీనివాస్ మరియు కుంట గంగ రెడ్డి పిప్పెర రామ్ రెడ్డి లను వారి నివాసం లో పరామర్శించారు. వారి వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి సంఘం అనిల్ కుమార్ బీజేపీ ఆర్మూర్ పట్టణ మాజీ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కిసాన్ మోర్చా మోర్తాడ్ మండల ఉపాధ్యక్షులు శేఖర్ రెడ్డి ఉన్నారు

## అండర్ 18 ఖో ఖో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే



**కోరుట్ల** :క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కావని ు అవి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, శారీరక-మానసిక దృఢతకు పునాది అన్నారు..టీమ్ వర్క్, నాయకత్వ లక్షణాలు, ఓర్పు, పట్టుదల వంటి విలువలు క్రీడల ద్వారానే నేర్చుకుంటారని తెలిపారు.. ఖో ఖో వంటి భారతీయ క్రీడలకు యువతలో పెరుగుతున్న ఆదరణ ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు..ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి తనవంతు ప్రోత్సాహం, అవసరమైన సదుపాయాలు అందిస్తానని హామీ ఇచ్చారు.తమ ప్రతిభను చూపించడానికి వచ్చి పోటీ పడ్డ ఆటగాళ్లను అభినందిస్తూ, ఎంపికలలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు..కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కోరుట్ల స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే గారు అభినందించారు



# ఆరాధన అందరికి గుర్తుండిపోతుంది



'పొలిమేర' 'ఇట్లు మారేడుమిల్లి' వంటి చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైంది తెలుగమ్మాయి కామాక్షి భాస్కర్ల. ఆమె అల్లరి నరేష్ సరసన కథానాయికగా నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ' ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తన పాత్రపేరు ఆరాధన అని, ఆమె ఎక్కడి నుంచి వచ్చింది? ఏం చేస్తుందనే అంశాలు ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తాయని చెప్పింది. తన పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని, ఆరాధన లేకపోతే సినిమా కథే లేదని, అందరికి గుర్తుండిపోయే పాత్ర అవుతు ందని తెలిపింది. 'హీరోలు అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు. కానీ నాయికల విషయంలో పరిమితులు కనిపిస్తాయి. అందుకే ప్రతి సినిమాలో ఛాలెంజింగ్ రోల్స్ ఎంచుకుంటున్నా. నేను అపోలో హాస్పిటల్‌లో జనరల్ ఫిజీషియన్‌గా ప్రాక్టీస్ చేశాను. ఇప్పుడు మాత్రం పూర్తిగా నటనకే సమయాన్ని కేటాయిస్తున్నా' అని చెప్పింది. ప్రస్తుతం తాను 'డెకాయిట్' చిత్రంలో నటిస్తు న్నానని, మరో పెద్ద సినిమా ప్రకటన త్వరలో వస్తుందని, అలాగే 'పొలిమేర-3' కూడా ప్రారంభం అవుతుందని కామాక్షి భాస్కర్ల పేర్కొంది.

# 27న 'ఆంధ్ర కింగ్ తాలూకా'.



రామ్ పోతినేని నటించిన మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ స్టార్ ఉపేంద్ర ఇందులో రియల్‌లైఫ్ సూపర్‌స్టార్‌గా నటించారు. మహేశ్‌బాబు.పి దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్టు గతంలో ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఒకరోజు ముందుగానే అంటే.. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఓ అభిమాని బయోపిక్‌గా తెరకెక్కిన సినిమా ఇదని, వేలాది అభిమానుల జీవితాలను ప్రతిబింబించే ఈ సినిమా ఆడియన్స్‌కి అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని మేకర్స్ తెలిపారు. భారతీయ సినీ చరిత్రలోనే కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా ఇదని, ఈ నెల 18న కర్నూల్‌లో భారీ పబ్లిక్ ఈవెంట్‌ని నిర్వహించనున్నామని నిర్మాతలు తెలిపారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

# తల్లిదండ్రులైన బాలీవుడ్ స్టార్ దంపతులు



బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్‌కుమార్ రావు, ఆయన సతీమణి పత్రలేఖ తల్లిదండ్రులయ్యారు. శనివారం నాడు పత్రలేఖ పండంటి పాపకు జన్మనిచ్చింది. తమ నాలుగో వివాహ వార్షికోత్సవం రోజునే ఈ శుభవార్తను పంచుకుంటూ ఈ జంట సోషల్ మీడియా వేదికగా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. "మా నాల్గవ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దేవుడు మాకు ఇచ్చిన గొప్ప ఆశీర్వాదం ఇది. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. పాపకు స్వాగతం చెబుతూ పోస్ట్ పెట్టిన రాజ్‌కుమార్, పత్రలేఖ దంపతులకు బాలీవుడ్ సినీతారలు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ 'తల్లిదండ్రుల క్లబ్‌లోకి స్వాగతం' అని కామెంట్లు పెడుతున్నారు. రాజ్‌కుమార్ రావు, పత్రలేఖ కొంతకాలం పాటు ప్రేమ ప్రయాణం కొనసాగించిన తర్వాత, పెద్దల సమక్షంలో 2021లో నవంబర్ 15న పెళ్లి చేసుకున్నారు.

# గుర్తుంచుకునే క్రైమ్ కామెడీ




'చాలా మంచి ఎంటర్‌టైనర్ ఇది. నిర్మాతలు పాషన్‌తో ఈ సినిమా తీశారు. క్లారిటీ ఉన్న దర్శకుడు రామ్. సహ నటులంతా అద్భుతంగా నటించారు. సాంకేతికంగా కూడా సినిమా బావుంటుంది. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. అందరికీ నచ్చుతుందని నమ్మకంతో ఉన్నాం.' అని హీరో రాజ్‌తరుణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. రామ్ కుడుముల దర్శకుడు. మాధవి, ఎం.ఎస్.ఎం.రెడ్డి నిర్మాతలు. ఈ నెల 21న సినిమా విడుదల కానున్నది.సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడారు. పదికాలాలపాటు చెప్పుకునే క్రైమ్ కామెడీ సినిమా ఇది అవుతుందని, ఇంటిల్లిపాదినీ అలరించే సినిమా ఇదని, త్వరలో పెయిడ్ ప్రివ్యూస్ వేయనున్నామని అందరూ చూసి ఆనందిస్తారని నమ్మకంతో ఉన్నామని దర్శకుడు రామ్ కుడుముల ఆశాభావం వ్యక్తం చేశారు.ఇంకా కథానాయిక రాశీసింగ్, గోవిందరాజు, మాధవి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత వివేక్ కూచిభొట్ల చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.

# స్త్రీలకు మద్దతుగా నిలవాలి.



'నేను నటిని మాత్రమే కాదు. ప్రస్తుతం తల్లిని కూడా. ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే ఈ రెండు బాధ్యతల్నీ విజయవంతంగా నిర్వర్తించొచ్చని కొందరు అంటున్నారు. కానీ వాస్తవానికి అది చాలా కష్టం. కొత్తగా తల్లి అయిన స్త్రీలను పని ఒత్తిడికి లోను చేయడం సమంజసం కాదు. ఈ విషయంలో అంతా సదరు స్త్రీలకు మద్ధతుగా నిలవాలి.' అని నటి దీపిక పదుకోణ్ అన్నారు. '8గంటల వర్కింగ్ అవర్స్' డిమాండ్‌తో కొన్ని నెలలుగా చర్చనీయాంశమయ్యారామె.ఈ కారణంగా కొన్ని సినిమాలను కూడా ఆమె వదులుకున్నారు. రీసెంట్‌గా తన అభిప్రాయాన్ని సమర్ధించుకుంటూ మళ్లీ మాట్లాడారు దీపిక. 'ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే అత్యుత్తమంగా పనిచేయగలం. ఒత్తిడికి లోనైతే అవుట్‌పుట్ కూడా సరిగ్గా రాదు. అందుకే.. నా సొంత ఆఫీస్‌లో కూడా నా ఉద్యోగులందరికీ సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పనిచేయిస్తాను. ఎవరికైనా సరే ఆరోగ్యమే ప్రధానం. దాన్ని కాపాడుకోవడమే అన్నింటికన్నా ముఖ్యం.' అని చెప్పుకొచ్చారు దీపిక పదుకోణ్.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..